# నిషేధాల అంతరార్థం

మానవ పరిణామానికి ఎక్కువగా సాయపడిన ప్రోద్బలశక్తులలో నిషేధాలకూ నియమాలకూ సునాయాసంగా ప్రథమస్థానాన్ని యివ్వవచ్చు. చీకటి యుగాల్లో తన ప్రయాణాన్ని ప్రారంభించి, అడుగడుక్కీ నిషేధాలను ఎదుర్కొని, పోరాడి, విజయస్థూపాలను నిర్మిస్తూ మానవుడు నేటి రూపాన్ని పొందేడు.

నిషేధాలలో ఇమిడివున్న భావాలు ఎంత సంకుచితమైనవయినా, నిషేధాలు మానవజాతికొక తప్పని సరియైన చారిత్రి కావశ్యకాలైనాయి.

అడ్డులేనిచోట మానవుడు ఆగిపోతాడు. కాళ్లు చాచుకుని నిద్రపోతాడు. అతడ్ని ముందుకి నడిపించి, అతడి శక్తి సామర్థ్యాలకూ, బుద్ధి చాతుర్యానికీ పరిశ్రమ కల్పించాల్నంటే అతడి దోవలో ఒక పెద్ద బండరాతిని నిలబెట్టాలి. ఆ బండరాయే నిషేధమనుకోండి. అది అక్కడ తన దోవకు అడ్డుగా వుండబట్టే మానవుడు దాన్ని ధిక్కరించి, దాన్ని దాటి ముందుకి వెళ్ళే కార్యక్రమాన్ని సాగిస్తాడు. ఈ దృష్టితో చూస్తే మన బాటను అరికట్టే ప్రతి రాయినీ, ప్రతి నిషేధాన్నీ మనం పూజ్యంగా భావించి, దానికి స్తోత్రంచేయాలి. ఎందుకూ? అది మన ఆలోచనాశక్తిని రేపి ఆ అడ్డును జయించేవిధానాన్ని మనం పరిశోధించేటట్టు చేసింది గనక. ఇప్పుడు మనకి అర్థమవుతూంది, మనం రాతి దేవుళ్ళ నెందుకు కొలవాల్నో, 'ఇలా చెయ్యాలి, అలా చెయ్యాలి' అని శాసించే పెద్దలను ఎందుకు పూజించాల్నో వగైరా వగైరా...

వెనకటికి ఒక యదార్థవాది అన్నాడు. "Rules are made only to be broken"—నిబంధనలన్నీకూడా అతిక్రమింపబడటం కోసమే తయారు చేయబడినాయని!

ఈ కొలమానంతో కొలిచిచూస్తే ప్రపంచంలో ఈనాడు కనిపించే ఇన్నినిషేధాలూ, నియమాలూ, శాసనాలూ - వీటిలోని అంతరార్థం బోధపడుతుంది. ఈ ముఖ్యసూత్రాన్ని ఆధారంచేసుకునే మానవజాతి అనేక గుణపాఠాలను నేర్చుకుని అనేకవిధాల అభివృద్ధికి వచ్చింది.

నిబంధనలు అతిక్రమించడమనేది ఈనాడు మనం చూస్తూండేది కాదు. ఆదినుంచీ వుంది. అవ్వచే ప్రోత్సహింపబడి ఆదాం ఆపిల్ పండ్లను కోసి తినకపోతే ప్రపంచం కథ వేరుగా వుండేదని బైబిలు చదివినవారికి తెలుస్తుంది.

మొట్టమొదటినుంచీ కూడా, నిషేధాలు రెండు తరహాలగా వుంటున్నాయి-ఒకటి: కొన్ని నైతిక, భౌతిక అవసరాలచే ప్రోద్బలింపబడి 'ఈపని చెయ్యకూడదు-చేస్తే తప్పు' అని కొందరు పెద్దలుజేరి నిర్ణయించడం. ఈ విధమైన నిషేధాలను మనం అర్థంచేసుకోగలం, వాటి ఆవశ్యకతను గుర్తించగలం. వాటిలోని సదుద్దేశాన్ని గ్రహించగలం. ఉదాహరణకు: నూరు నూటయాభై సంవత్సరాలక్రితం మైసూరు సంస్థానంలోనూ, రాజపుటానాలోనూ కొన్నిచోట్ల స్నానం చేయకూడదనే నిషేధం అమలులో వుండేది. అప్పట్లో ఆయాప్రదేశాలలో నీటి కరువు ఏర్పడిందట. అందుచేత ఉన్న కాసిన్ని నీళ్లతోనూ వొళ్ళు కడిగేసుకుంటే త్రాగడానికి నీళ్లుండవని గ్రహించి అక్కడ ఆ నిషేధాన్ని అమలులో పెట్టారు; స్నానంచేసి, నీళ్ళు పాడుచేసినవాళ్ళను శిక్షించేవారు. ఇంతేగాకుండా మైసూరు సంస్థానంలోనే అదే సమయంలో గుడ్డలు ఉతుక్కోకూడదనే నిషేధంవుండేది. దీనికికూడా కారణం నీటికరువే. కాగా ఆ ప్రాంతంలోని జనులు ఒక కొత్తవస్త్రం ధరించారంటే మరి అది చిరిగిపోయేవరకూ విడవకుండా ఉతక్కుండా కట్టుకునేవారట. ఈ పద్ధతినిచూసి ఈనాడు మనం నవ్వవచ్చు కాని, అప్పుడు ఆ నీటికరువు పరిస్థితులలో ఆ నిషేధం తప్పని సరియైన అవసరమైంది జనబాహుళ్యానికి. ఇప్పటికికూడా రాజపుటానాలో కొన్నిభాగాలలో సరియైన నీటి వసతులులేక జనం స్నానంచేయడమంటే ఏమిటో ఎరగరు. ఇటువంటి నిషేధాలను మనం అర్థంచేసుకుని వాటి ఔచిత్యాన్ని గుర్తించగలం.

ఇంక ఈ నిషేధాలలో మరోతరహా వుంది. ఈ రకం నిషేధాలు కేవలం మానవజాతి అభివృద్ధిని అరికట్టడానికి ఉద్దేశింపబడి సంకుచిత దృక్పథాన్ని సూచించేవి. కాని, వింత ఏమంటే, ఇవే మానవ పరిణామానికి ఎక్కువ కారణభూతమైనవి.

ఒక్క స్నానాల విషయమే తీసుకుని చూస్తే ప్రపంచంలో కొన్ని

'ఈ కథ అంత విచిత్రమయిందిగనుక యదార్థం విచిత్రంకంటే విచిత్రమైనదీ'

'ఉపోద్ఘాతం చాలించి కథకు ఉపక్రమిస్తావా?'

'ఈ డబ్బాలో ఏముందో తెలుసునా?'

'ముక్కు పొడుం ఉండదని ఇదివరకే చెప్పావు!'

'ఉండనిదాని గొడవ దేనికీ?'

'ఉండనివన్నీ యేమిటో తేలిపోతే ఉండేవి వాటంతట అవే తెలుస్తాయి-సిగరెట్లు పట్టేటంత పెద్దదికూడా కాదు ఆ డబ్బా-'

'చూడూ, ఎంత చిన్నదో!'

'దాని నగిషీని చూస్తూంటే, నీకు దానిమీదగల ప్రేమను చూస్తూంటే అందులో ఏదో మహత్తరమైన-'

'ప్రియురాలి ఫోటోకూడా కాదు-ఇంత చిన్నడబ్బాలో...'

'మరేముంది భాయీ? చెప్పు చూతాం.'

'నా ప్రాణం!'

'ఆ ముక్క ఇదివరకే చెప్పాను. కాని, అది ఏ రూపంతో అందులో అణిగివుందో...ప్రణయ లేఖా?'

'బోల్తా కొట్టేవు!'

'ఇంక వూహించను! సూటిగా చెప్పెయ్యి-'

'నేను ఒకనాటి రాత్రి రైలుప్రయాణం చేస్తున్నా-'

'చేస్తూంటే?'

'తెనాలి స్టేషన్లో ఎక్కిందీ-'

'ఎవరూ?'

'నా ప్రణయ సామ్రాజ్యలక్ష్మి-'

'నీ భార్యా?'

'ఛా! ఒక సుందరాంగి.'

'అంటే, ఆ సుందరాంగే నీ భార్య కాలేదన్నమాట?'

'అదే నా భార్య అయితే ఈ వెండిడబ్బా ఎందుకు నాకూ?'

'అంటే, ఆ సుందరాంగి తాలూకు స్మరణ చిహ్నమేదో ఈ డబ్బాలో-'

'చెబ్తా విను-'

'బాగా వింటున్నా.'

'ఆమె తెనాలి స్టేషన్లో ఎక్కగానే పడుకున్నవాడినల్లా లేచి కూర్చున్నాను. మా బండికి కొత్త తేజస్సు వచ్చింది,'

'అది మామూలే లే!'

'ఆవిడకు నా పక్కన జాగాయిచ్చి కూర్చోమన్నా. కూర్చుంది. కొంత సేపయాక 'పడుకుంటే పడుకోండి ఇంకొంచం చోటిస్తాను' అన్నాను. 'సరే' అంది. నేను వెనక్కు-బాగా వెనక్కు-జరిగాను'

'ఆమె పడుకున్నాక మళ్ళీ ముందరికి వద్దామనా?'

'ఛ! విను! ఆమె పక్క పరుచుకుంది-ఇటూ అటూ చూసి, మా ఇద్దరికీ మధ్యగా ఒక ట్రంకుపెట్టెని కాపలా పెట్టింది-'

'నువ్వేమైనా చేసిపోతావని కాబోలు!'

'ఏమైనా చేయదలుచుకున్న వాడికి ట్రంకుపెట్టెలు అడ్డుతాయా?'

'ఆ పళాన ఏం జరిగింది?'

'ట్రంకుపెట్టెను కాపలా పెట్టి ఆమె తనపక్కమీద నడుంవాల్చింది-'

'నువ్వేం చేశావు?'

'ఆమె రూపాన్ని ధ్యానిస్తున్నా. సమీపంలో అటువంటి మిగల ముగ్గిన సుందరి పడుకుని వుండటం నాకు మత్తెక్కించింది-'

'వికార చేష్టలేమైనా చేశావా?'

'ఇతర ప్రయాణీకులున్నారుగా? అయినా, సభ్యత మీరి మనబోటి గాళ్ళు తెగిస్తారా?'

'ఆపైన?'

'ఆ ట్రంకుపెట్టెను ఆనుకుని కూర్చున్నాను. ఆ ట్రంకుకు జేర్చి అవతలివైపున ఆమె తల-'

'పాదాలు కానందుకు సంతోషించావా?'

'విను ! ఆ తలలోంచి మల్లెవాసనలు–'

'హాయి !'

'ఆ సుందరిని నేను ఆ క్షణంలో–'

'ప్రేమించావు !'

'ప్రేమించి, ఆమెను నా హృదయ సింహాసనంలో ఆసీనురాలినిగా చేశాను–'

'ఆ పైన?'

'నేను దిగవలసిన స్టేషను సమీపించింది–'

'ఛిచ్చు ! కారుచిచ్చు ! నీకు మతిపోయివుంటుంది–'

'ఆ సౌందర్యరాసిని విడిచి వెళ్ళిపోవడమంటే–'

'గుమ్మడికాయపులుసు పారబోసుకున్నట్టయిందా?'

'నా హృదయంలో ఏదో బరువు ఏర్పడి శాశ్వతంగా ఆ భారం అలా వుండిపోయింది–'

'పాపం !'

'నేను దిగే స్టేషన్ సమీపిస్తూన్నకొద్దీ నా గుండెలలో ఆరాటం జాస్తి అయింది'

'అవుతుందిలే ! అది సహజమే'

'ఆపళాన తెగించాను–'

'ఏం చేశావు భాయీ?'

'ఆమె జ్ఞాపకార్థం ఆమె తాలూకు ఒక వస్తువ–'

'మంగళసూత్రమా?'

'కాదు'

'తలలోని బంగారు చామంతి పూవా?'

'కాదు'

'నానుతాడా?'

'కాదు'

'మరేమిటి?'

'చెప్పాలో చూదాం?'

'నువ్వే చెప్పు-'

'ఆమె తల నలంకరించిన ఒకానొక-'

'తెలిసిందిలే-మల్లెపూవు.'

'కాదు! శిరోజం!'

'నలుగురికీ తెలిసే భాషలో వెంట్రుక.'

'నొప్పి కలక్కుండా మెల్లిగా వూడదీశాను-కాయితాన్ని పొట్లంకట్టి భద్రంగా జేబులో వేశాను. ఇంటికివచ్చి ఈ వెండి లాకెట్‌లో పెట్టేను- చూశావా?'

'నేను చూడను! నీ భార్యకు చూపెట్టు, కలేజా వున్నవాడివైతే!'

---

# అమృత హస్తం

'వచ్చావా... ఈ దీనుడి ప్రాణాలను రక్షించడానికి?'

'...............'

'రా! ఏదీ నీ అమృతహస్తం! నా హృదయంమీద వేసి నన్ను శాంతింపజెయ్యి-'

'...............'

'నువ్వు రావడం ఇంకొక్క క్షణం ఆలస్యమైతే ఈ బాకుతో పొడుచుకుని చచ్చిపోయివుందును...'

'ఎంత దారుణమైన విధానం...!'

'నేను రాయలేదూ నీకూ-నువ్వు నన్ను నిజంగా ప్రేమించిన దానవైతే ఈ ఉత్తరం అందగానే వెంటనే బయల్దేరివచ్చి నన్ను ఆత్మహత్య నుంచి తప్పించవలసింది... అనీ?'

'అవును! ఎనిమిదిన్నర దాటితే ఈ వెధవ బాకుతో పొడుచుకుని శారున చచ్చి వూరుకుంటానన్నారు!'